క్లుప్తంగా

ఎల్‌ఐసీ ప్యానల్ న్యాయవాదిగా మణిబాబు



సత్తెనపల్లి: ఎల్‌ఐసీ సత్తెనపల్లి బ్రాంచ్ ప్యానెల్ న్యాయవాదిగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, న్యాయవాది చిన్నం మణిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ ఎల్‌ఐసీ యాజమాన్యం తనపై నమ్మకంతో ప్యానెల్ న్యాయవాదిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్తెనపల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



ముప్పాళ్ల: ప్రజలకు అందించే సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సత్తెనపల్లి ఆర్డీవో జి.వి.రమణకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెంలో గల శ్రీసాయిబాబా మందిర ఆవరణలో శనివారం తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పదవీ విరమణ చేయాల్సిందేనని తెలిపారు. ప్రజల నుంచి మన్ననలు పొందాలంటే వారికి దగ్గరగా పని చేయాలని చెప్పారు. ఎంతో మంది కలెక్టర్ల వద్ద భవానీశంకర్ వివాదాలకు తావివ్వకుండా పని చేయడం అభినందనీయమని తెలిపారు. పలువురు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం భవానీశంకర్, పద్మావతి దంపతులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించి, అభినందన పత్రం అందించారు. జిల్లా కలెక్టర్ జి.అరుణ్‌బాబు, ఆర్డీవోలు మధులత(నరసరావుపేట), మురళీ(గురజాల)లు ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భవానీశంకర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



క్రోసూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చేపట్టే ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ కోరారు. క్రోసూరులో శనివారం నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న క్రోసూరులో మధ్యాహ్నం రెండు గంటలకు సీపీఐ మండల మహాసభ నిర్వహిస్తున్నామని, నాయకులంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఐ నాయకులు చెన్నకేశవ, వెంకట్రావు, కరీముల్లా, శ్రీనివాసరావు, పోతుగంటి నాగేశ్వరరావు, పసుపులేటి యాదగిరి, కంచేటి పెద్దబ్బాయి, సామంతపూడి పాండు, ఆకుల శ్రీనివాసరావు, వెంకట్రావు, జమ్ముల బాజీ పాల్గొన్నారు.

అనాథలకు ఆసరాగా 'స్నేహ హస్తాలు'



అచ్చంపేట: గుండెపోటుతో తండ్రిని, అనారోగ్యంతో తల్లిని పోగొట్టుకున్న విద్యార్థులకు స్నేహ హస్తాలు ఆసరాగా నిలచింది. బీటెక్ చదువుతున్న ఇద్దరికి రూ.1,20,000 చెక్కును స్థానిక సీఐ పోలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు విద్యార్థుల చదువు ఆగిపోకుండా స్నేహ హస్తాలు ఆదుకోవడం అభినందనీయమని తెలిపారు. స్నేహ హస్తాలు ప్రతినిధి తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన మద్దినేని శిరీష విజయవాడలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం, మద్దినేని భానుతేజ విజయవాడలోనే క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హార్ట్ ఎటాక్‌తో తండ్రి చనిపోగా, గతంలోనే తల్లి అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్నేహహస్తాలు ప్రతినిధి మన్నెం భద్రయ్య పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

నూజెండ్ల: మండలంలోని యోగిరెడ్డిపాలెంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'గౌరవం' దక్కడం లేదు !

- ఆరు నెలలుగా ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవ వేతనం
- ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వివక్ష
- నిధుల కేటాయింపులోనూ చిన్నచూపు



ముప్పాళ్ల మండల పరిషత్ కార్యాలయం

మండలాల వారీగా ఎంపీటీసీ సభ్యుల వివరాలు

మండలం	సభ్యులు
సత్తెనపల్లి	19
ముప్పాళ్ళ	12
రాజుపాలెం	13
నకరికల్లు	18

ముప్పాళ్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండేలా పాలన సాగిస్తామని కూటమి నాయకులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయింది. అధికారులు కూడా టీడీపీ నాయకులకు అండగా ఉంటున్నారు. వారు చెప్పిందే వేదంగా భావిస్తున్నారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పాలన సాగిస్తున్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు కూడా ఆహ్వానం పలకడం లేదు. ఎటువంటి హోదా లేని టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

గౌరవ వేతనం ఊసే లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం కూడా మంజూరు చేయడం లేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 62మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.3వేలు గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనం చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు విడతలకు సంబంధించి గౌరవ వేతనం నిలిచిపోయింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఎన్నికల నియమావళి అనంతరం మూడు నెలలకు గానూ వేతనం జమ అయింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలపై దృష్టి సారించ లేదు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాల్లో హాజరుకు మాత్రమే పరిమితమయ్యారు. ప్రజా సమస్యల్ని సభ దృష్టికి తెచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ వైఎస్సార్ సీపీ సభ్యులే అధిక స్థానాల్లో విజయం సాధించి ఎంపీపీ పీఠం కైవసం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురి చేస్తూ టీడీపీ కండువాలు కప్పింది. పార్టీలోకి చేర్చుకోవడమే తప్పా కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. కనీసం ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలకు సైతం ఆహ్వానించడం లేదు. నిధులు మంజూరు, అభివృద్ధి పనులకు కేటాయింపుపై కనీస సమాచారం ఇవ్వకుండా వివక్షత చూపుతున్నారని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వసభ్య సమావేశాలకు వచ్చి టీ, బిస్కెట్ తిని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

ఇదెక్కడి న్యాయం ?



ప్రజా ప్రతినిధులంటే కూటమి ప్రభుత్వానికి చులకన భావం. ప్రోటోకాల్ కూడా పాటించడం లేదు. వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి? ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి. అధికారంలో ఉంటేనే గౌరవం ఇస్తామనే పద్ధతి మానుకోవాలి. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులివ్వకుండా హోదా లేని టీడీపీ నాయకులకు పనులు కేటాయిస్తున్నారు. ఇదెక్కడి రాజ్యాంగం ?

–గోగుల అంజిబాబు, ఎంపీటీసీ సభ్యుడు, మాదల

వారంలో జమ



వేతనాలకు సంబంధించి బిల్లులు పంపించాం. మరో వారంలో వారి ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది. సమస్యల్ని మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

–పి.రత్నం, ఎంపీడీవో, ముప్పాళ్ల

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల



ఏడుకొండలు, కమాల్ బాషాలను సత్కరిస్తున్న డాక్టర్ గజ్జల, నిమ్మకాయల, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సత్తెనపల్లి మండలం కట్టమూరుకు చెందిన దార్ల ఏడుకొండలు, పార్టీ జిల్లా సెక్రెటరీగా నియమితులైన రాజుపాలెం మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కమాల్ బాషాలను శనివారం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు పొందిన వారు అందరిని కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ అభినందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది పెండెం బాబూరావు, సత్తెనపల్లి, రాజుపాలెం, పార్టీ ముప్పాళ్ల మండల అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాసరావు, నక్కా శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పశుపోషణ లాభదాయకం



డ్రోన్ పనితీరును రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త సౌజన్యలక్ష్మి

సత్తెనపల్లి: వ్యవసాయంతో పాటు పశుపోషణను రైతులు చేపట్టడం వల్ల మరింత లాభదాయకమైన, స్థిరమైన ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా సత్తెనపల్లి మండలంలో 421 మంది రైతులకు శనివారం సాంకేతిక మార్గదర్శకత్వం నిర్వహించారు. మండలంలోని కంటెపూడి, నందిగామ, గుడిపూడి గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి రైతులకు ఈ–నామ్ పోర్టల్ వినియోగం, కిసాన్ సారథి టోల్ ఫ్రీ నంబర్ గురించి వివరించారు. ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సంక్షోభ నేపథ్యంలో పంటల వైవిధ్యం గురించి వ్యవసాయ అధికారులతో కలిసి వివరించారు. తాజా మేత రకాలు, డ్రోన్ పనితీరు, వ్యాధి నిరోధకం, టీకాలు, గొర్రె , పందుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు అవకాశాలు, రైతులకు అందుబాటులో ఉన్న సబ్సిడీలను వివరించారు. సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న జనుము, జీలుగ, పిల్లిపెసర పంటలను సాగు చేసి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపురంలో లూథరన్ చర్చి ప్రారంభం



పార్థనలు చేస్తున్న బిషప్ పరదేశిబాబు

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో నూతనంగా నిర్మించిన పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయం ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరేటర్ ఏఈఎల్‌ఎల్‌సీ బిషప్ కె.ఎఫ్. పరదేశిబాబు, గుంటూరు పినడ్ బిషప్ ఎస్.జె. బాబూరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లింగాపురం ప్యారిస్ పాస్టర్ కరుణకుమార్ ఆధ్వర్యంలో ఇతర గురువులు ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిషప్ కె. ఎఫ్. పరదేశిబాబు మాట్లాడుతూ వ్యయప్రయాసలకు ఓర్చి అత్యంత సుందరమైన ఆలయాన్ని నిర్మించుకున్న లింగాపురం వాసులను అభినందించారు. ప్రతి ఒక్కరూ శాంతి, సహనం, సహాయపడే గుణం అలవర్చుకుని క్రీస్తు బోధనలను ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చర్చి నిర్మాణ కమిటీ చైర్మన్ కె. రామారావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

సత్తెనపల్లి: పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే అందజేశారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ఆనందకుమార్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయప్రకాష్ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

88 శాతం పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలో శనివారం సామాజిక పెన్షన్ల పంపిణీ(ఎన్టీఆర్ భరోసా) 88.83 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో జి.రవికుమార్ తెలిపారు.మండలంలో 15 సచివాలయాల పరిధిలో 8,875 లబ్ధిదారులకు గానూ 7,528 మందికి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం నగదు రూ. 3,69,15,500 విడుదల కాగా వాటిలో తొలిరోజు రూ. 3,24,93,500 పంపిణీ చేసినట్లు ఎంపీడీవో చెప్పారు.

పశు పోషకులకు సబ్సిడీపై దాణా పంపిణీ



దాణా అందిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

అచ్చంపేట: పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పాల ఉత్పత్తిదారులకు పశువుల దాణా సరఫరా చేస్తోందని పశుసంవర్థక శాఖ వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. స్థానిక పశు వైద్యశాల వద్ద శనివారం ఆమె దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతగా మండలానికి 180 క్వింటాళ్ల దాణాను ప్రభుత్వం సరఫరా చేసినట్లు చెప్పారు. అసలు ఖరీదు క్వింటా రూ.1100కాగా 50శాతం సబ్సిడీపై రూ.550కే పశు పోషకులకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పశు పోషకులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాల దిగుబడిని పెంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి, గ్రామ సర్పంచ్ షేక్ జాని, సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు



శిక్షణలో మాట్లాడుతున్న లాం ఫాం శాస్త్రవేత్త అనిల్‌కుమార్

రాజుపాలెం: పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని సస్యరక్షణ శాస్త్రవేత్త మోడల్ అధికారి డాక్టర్ సీహెచ్. అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని గణపవరం రైతు సేవాకేంద్రంలో వికసిత కృషి సంకల్ప అభయాన్‌లో భాగంగా విజ్ఞాన కేంద్రం లాం ఫాం ఆధ్వర్యంలో శాస్త్రజ్ఞులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై శనివారం శిక్షణ ఇచ్చారు. డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ పత్రి, మిరప అపరాల పంటలలో సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. మండల ఉద్యాన అధికారి పామాయిల్, అరటి, బొప్పాయి పంటలకు ప్రభుత్వ రాయితీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య, రవిచంద్రన్, వీఏఏ సునీల, ఎంపీఈవో వెంకయ్య, రమేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాస యాదవ్

అచ్చంపేట: పౌరులంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు కాలనీలలో తమ హక్కులను కాపాడుకోవడం ప్రాథమిక హక్కుగా భావించాలని తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవంలో భాగంగా మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పౌరులంతా హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్న జాతులవారిని కించిపరచినట్లు మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని వివరించారు. ప్రతి నెలా చివరి రోజున ఏదో ఒక గ్రామంలో పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా ప్రభుత్వం శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేందుకు తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా జీవించాలని తహసీల్దారు సూచించారు. కాలనీ వాసులనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడిన దేశ ప్రజలు : సీపీఎం



సమైక్యతా ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు

క్రోసూరు: స్థానిక అంబేద్కర్ విగ్రహాల సెంటర్‌లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. మతోన్మాదం నశించాలి.. లౌకిక భారత దేశాన్ని కాపాడుకుంటాం.. ఉగ్రవాదాన్ని అంతమొందించాలి.. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే వారికి ఖబడ్దార్ అంటూ ప్రదర్శనలో నేతలు జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.బాబూరావు మాట్లాడుతూ పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవకాశంగా తీసుకొని మత ప్రాతిపదికన చీల్చాలని ప్రయత్నం చేసిందని తెలిపారు. ఉగ్రవాద దాడులను మతాలకతీతంగా దేశ ప్రజలు ఖండించి నిరసన తెలియజేసి, మత సామరస్యాన్ని కాపాడారని చెప్పారు. పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలకు అతీతంగా ప్రజలు స్పందించాలని, లేనిపక్షంలో దేశం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏపూరి గోపాలరావు, వై. రాధాకృష్ణ, ఏ. లక్ష్మీశ్వర్‌రెడ్డి , జి.రవిబాబు , మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, మండల నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, రావెళ్ల వెంకటేశ్వర్లు, మహిళా నాయకులు గుంటుపల్లి రజిని, ధరణికోట విమల పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇంటర్‌లో ఉచిత ప్రవేశం

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్, దాతల సహకారంతో ఈ విద్యా సంవత్సరం 30 మంది తల్లిదండ్రులు లేని పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ మీడియెట్‌లో ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆశ్రమం వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ శనివారం తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా ఆశ్రమం తరఫున నిర్వహిస్తున్న విద్యాసంస్థలో ఎంపీసీ, బైపీసీ ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లలో ఉచిత ప్రవేశంతో పాటు యూనిఫామ్, నోట్ బుక్స్, ప్రభుత్వం ద్వారా హాస్టల్‌లో ఉచిత విద్యను అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా పరిషత్, సోషల్ వెల్ఫేర్, మోడల్, కేజీబీవీ పాఠశాలలో చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తామని, పదవ తరగతిలో 400 పైగా మార్కులు సాధించినవారు ఉచిత అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి సీటు కేటాయిస్తామని తెలిపారు. దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్డు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా అనే చిరునామాకు పోస్ట్ ద్వారా లేదా 8096824399, 7989927520 నంబర్లకు వాట్సాప్ ద్వారా దరఖాస్తులను పంపాలని ఆమె సూచించారు. దరఖాస్తుతో పాటు పదవ తరగతి మార్కులలిస్ట్, స్టూడెంట్ ఆధార్, మదర్ ఆధార్, రేషన్ కార్డు, అర్హతకు సంబంధించి సొంత వివరణతో అర్జీ పంపాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



బస్టాండ్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

అమరావతి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణల్లో భాగంగా రవాణా, పోలీస్ శాఖలతో పాటు ఆర్టీసీ అధికారులు శనివారం సాయంత్రం సంయుక్త తనిఖీలు నిర్వహించారు. సుమారు 80 వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో 36 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అందులో ఐదు వాహనాలను స్వాధీనం చేసుకుని అమరావతి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అపరాధ రుసుం కింద రూ. 80,600 వసూలు చేశారు. తనిఖీల్లో ఆర్టీసీ డీఎం రాజశేఖర్, సీఐ వై.అచ్చయ్య ఎస్.ఐ కె.అమీర్, రవాణా శాఖ సహాయ తనిఖీ అధికారి ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దీనివల్ల ప్రమాదాలను నిర్మూలించవచ్చని రవాణా శాఖ సహాయ తనిఖీ అధికారి ఎం.సురేష్‌బాబు తెలిపారు

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

నకరికల్లు: యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను జూన్ 2వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శనివారం తెలిపారు. మండలానికి 220 క్వింటాళ్ల జీలుగ, 102 క్వింటాళ్ల జనుము, 54 క్వింటాళ్ల పిల్లిపెసర తదితర విత్తనాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. జీలుగ కేజీ రూ. 123 కాగా రాయితీపై రూ. 61.50కు, జనుము కేజీ రూ.109 కాగా రాయితీపై రూ.54.50, పిల్లిపెసర రూ .180 కాగా రాయితీపై రూ. 90లకు పంపిణీ చేస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు: గ్రామంలోని పలు ప్రధాన లైన్‌లకు మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ షేక్ గౌస్ శనివారం తెలిపారు. సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మేట్లతో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని సూచించారు. కొలతల ప్రకారం కనీస వేతనం వచ్చేలాగా కూలీలతో పనులు చేయించాలని సూచించారు. జాబ్ ఉన్న ప్రతి ఒక్కరు పనికి వచ్చే విధంగా, ఇచ్చిన టార్గెట్ ప్రకారం పనులు చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 37 పనుల్లో 482 గ్రూపులకు చెందిన 3,752 కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్, టీఏ ఎస్. వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాల స్వీకరణ

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి గృహ, పెన్షన్, వైద్యం, పలు సమస్యలు తీసుకొచ్చారని తెలిపారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశానని చెప్పారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు సరఫరా

అచ్చంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డుదారులు జూన్ ఒకటి నుంచి చౌక ధరల దుకాణాల నుంచే రేషన్ తీసుకోవాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ శనివారం తెలిపారు.మండలంలో మొత్తం బియ్యం కార్డులు 20,800 ఉన్నాయని, అందుకు గాను 3,000 క్వింటాళ్లను దుకాణాల ద్వారా సరఫరా చేయనున్నట్లు చెప్పారు.కొత్త రేషన్ కార్డులు, కార్డులో పేర్లు నమోదుకు గ్రామ సచివాలయం ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

క్రోసూరులో..

ప్రజా పంపిణీ సరుకులు మళ్లీ పాత పద్ధతిలో రేషన్ షాపుల్లోనే పంపిణీ చేయనున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 43 మంది రేషన్ డీలర్ల పరిధిలో 20,080 తెల్లకార్డుదారులు ఉన్నారని చెప్పారు. కార్డుదారులకు బియ్యం, పంచాదార అందిస్తున్నట్లు తెలిపారు.

సత్తెనపల్లిలో..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చౌక దుకాణాల్లో బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కెఎస్.చక్రవర్తి తెలిపారు. ప్రతి నెలా డీలర్లు ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్డుదారులకు నిత్యావసర సరుకులు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా వారికి రసీదు అందజేయాలని ఆయన డీలర్లకు సూచించారు.